సాక్షి తూర్పుగోదావరి

బుధవారం । 16 । అక్టోబర్ । 2024



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పలిమి సత్యనారాయణ (జంగారెడ్డిగూడెం) కుటుంబ సభ్యులు రూ.50 వేల విరాళం అందించారు.




ఆహారమే ఐశ్వర్యం

10లో

యునైటెడ్ నేషన్స్‌కు చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అసోసియేషన్ (ఎఫ్ఏవో) అనే సంస్థను 1945 అక్టోబర్ 16న ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ రోజును ప్రపంచ ఆహార దినోత్సవంగా జరుపుకొంటున్నారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 73,742 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 6,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నేతల భేటీ



సమావేశమైన కూటమి నేతలు

సీటీఆర్ఐ: త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మంజీర కన్వెన్షన్ హాల్లో మంగళవారం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెం నాయుడు మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టును గాడిలో పెట్టేందుకు కేంద్ర సాయం తీసుకుంటున్నామన్నారు. లిక్కర్ పాలసీతో రాష్ట్ర ప్రభుత్వానికి 90 వేల దరఖాస్తుల ద్వారా రూ.1,800 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. మంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్ష ప్రశాంతం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లాలో ఉపాధ్యాయుల అర్హత పరీక్షలు మంగళవారం ఉదయం సెషన్-1లో పేపర్-2ఏ (మ్యాథ్స్-సైన్స్) పరీక్ష నిర్వహించారు. మొత్తం 240 మంది అభ్యర్థులకు 214 మంది హాజరు కాగా, 26 మంది గైర్హాజరు అయినట్టు జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. మధ్యాహ్నం సెషన్-2లో పేపర్-2ఏ(మ్యాథ్స్- సైన్స్) పరీక్ష నిర్వహించగా, మొత్తం 240 మంది అభ్యర్థులకు 215 మంది అభ్యర్థులు హాజరవ్వగా, 25 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. పరీక్షా కేంద్రంలో ఉపాధ్యాయుల అర్హత పరీక్ష రెండు సెషన్లలోను ప్రశాంతంగా జరిగిందని వాసుదేవరావు తెలిపారు.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ



సందీప్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష కోసం మూడు నెలల శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి(ఇన్‌చార్జి) ఎం సందీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత భోజన, వసతి సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. అభ్యర్థులు ఈ నెల 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఇంటర్మీడియెట్‌తో పాటు, డైట్ సెట్, టెట్, డిగ్రీ గ్రాడ్యుయేషన్, బీఈడీలో ఏదైనా విద్యార్హత ఉన్న వారు అర్హులని తెలిపారు. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2.50 లక్షల్లోపు ఉండాలన్నారు. ఈ నెల 25 వరకూ హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్, 27న పరీక్ష, 28న మెరిట్ లిస్ట్ ప్రకటన ఉంటుందన్నారు. జిల్లాల వారీగా ఎంపికైన వారి లిస్టును 30న ప్రకటిస్తారన్నారు. వచ్చే నెల 3న కోచింగ్ మొదలవుతుందని వివరించారు.

మీకొస్తే.. మాకేంటి..?

- పూర్తయిన మద్యం షాపుల లాటరీ ప్రక్రియ
- ఇప్పటికే సింహభాగం దుకాణాలు కైవసం చేసుకున్న కూటమి నేతలు
- కొత్తవారికి కేటాయించిన వాటిపై కన్నేసిన ఆ ఎమ్మెల్యేలు
- 25 శాతం కమీషన్ ఇవ్వాలని బెదిరింపులు
- ఇదేం పద్ధతంటూ వ్యాపారుల గగ్గోలు
- పైకి చెప్పుకోలేక లోలోపల సతమతం
- ఏరియాలు పంచుకునే పనిలో నిమగ్నమైన యజమానులు
- లాటరీ ముగియగానే సిండికేట్ ప్రత్యేక సమావేశం

మహా మద్యం సమరంలో కీలక ఘట్టం ముగిసింది. లాటరీ ప్రక్రియ పూర్తవ్వడంతో.. ఊహించినట్టుగానే కూటమి నేతలు అందిన కాడికి దుకాణాల్లో పాగా వేశారు. కొద్దోగొప్పో షాపులు దక్కించుకున్న ఔత్సాహికుల నోట మట్టి కొట్టేందుకు సిండికేటు అవతారమెత్తారు. అనుకున్నదే తడవుగా అధికార దర్పంతో.. నయానా భయానా లొంగదీసుకునేందుకు ఉద్యుక్తులయ్యారు.



సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ నేతల ధనదాహానికి అంతులేకుండా పోతోంది. ఇప్పటికే నిల్వ ఉంచిన ఇసుక అడ్డగోలుగా దోచేసి రూ.కోట్లు కొల్లగొట్టిన తమ్ముళ్లు ప్రస్తుతం మద్యంపై పడ్డారు. అనుకున్నదే తడవుగా మద్యం మాఫియా అవతారమెత్తారు. టీడీపీ సహా కూటమి నేతలు సిండికేట్‌గా ఏర్పడి, మద్యం దుకాణాల్లో సింహభాగం షాపులు కైవసం చేసుకున్నారు. అంతటితో సంతృప్తి చెందని నేతలు షాపులు దక్కించుకున్న కూటమేతర వ్యాపారుల దుకాణాలను టార్గెట్‌గా చేసుకున్నారు. తమకు 25 శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనంటూ ఎమ్మెల్యేలు, వారి అనుయాయులు బెదిరింపులకు దిగుతున్నారు. తమ ఆదేశాలు ధిక్కరిస్తే వ్యాపారం ఎలా చేస్తారో చూస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కమీషన్ లేదంటే తమ సిండికేట్ చెప్పినట్టు వ్యవహరించాలని పట్టుబడుతున్నారు. లాటరీ ప్రక్రియ పూర్తయిన మరుక్షణం నుంచే ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామం కొత్తగా షాపులు దక్కించుకున్న వ్యాపారుల్లో ఆందోళన కలిగిస్తోంది. స్వయంగా అధికార పార్టీ నేతలే రంగంలోకి దిగడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో వ్యాపారులు కొట్టుమిట్టాడుతున్నారు. కాదంటే భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో అన్న మీమాంస నెలకొంది. అధికార పార్టీ కావడం.. ఎక్సైజ్ అధికారులు సైతం వారి అడుగులకు మడుగులొత్తుతుండటంతో టీడీపీ నేతలు చెప్పింది తప్పకుండా వినాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఇదే తంతు సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి షాపులు దక్కించుకున్నారు. ప్రభుత్వానికి సైతం రూ.లక్షల్లో లైసెన్స్ ఫీజు చెల్లించాలి. దుకాణాల ఏర్పాటుకు స్థలం, గది ఇలా సమకూర్చుకోవాలి. ఇంకా వ్యాపారమే ప్రారంభం కాలేదు. ఇలాంటి సందర్భంలో కమీషన్ అంటే ఎలాగన్న మీమాంస వ్యాపారుల్లో నెలకొంది. పైకి చెప్పుకోలేక.. వ్యాపారం వదులుకోలేక లోలోపల మథనపడుతున్నట్టు తెలిసింది.

- రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో 28 షాపులకు టెండర్లు ఆహ్వానించగా.. స్థానిక ఎమ్మెల్యే తన అనుచరులు, బినామీల పేరుమీద 42 టెండర్లు దాఖలు చేసినట్టు తెలిసింది. అందులో 11 దుకాణాలు సదరు ఎమ్మెల్యే అనుయాయులకు దక్కాయి. మిగిలిన షాపులు బయటి వ్యక్తులు హస్తగతం చేసుకున్నారు. ఇది జీర్ణించుకోలేని ప్రజాప్రతినిధి, అనుయాయులు రంగంలోకి దిగారు. తాము చెప్పినట్టుగా షాపులు దక్కించుకున్న వారందరూ సిండికేట్ కట్టాలని వారిపై ఒత్తిడి తెస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలా చేయలేని పక్షంలో 25 శాతం కమీషన్ ఇవ్వాలని పట్టుబడుతున్నట్టు సమాచారం.
- రాజానగరం ఎమ్మెల్యే సైతం వివిధ నియోజకవర్గాల్లో 80 షాపులకు బినామీ పేర్లతో టెండర్లు దాఖలు చేసినట్టు తెలిసింది. గోకవరంలో 1, కోరుకొండ 3, జగ్గంపేట 2, రాజమండ్రి సిటీ, రూరల్‌లో సైతం దుకాణాలు దక్కినట్టు తెలిసింది. లాటరీ ప్రక్రియ ముగిసిన సాయంత్రం నుంచి ఎమ్మెల్యే నియోజకవర్గంలో దర్శనమివ్వడం లేదన్న ఆరోపణలున్నాయి. షాపుల ఏర్పాటుపై బినామీలతో మంతనాలు చేస్తున్నట్టు నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది.
- నిడదవోలు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి అనుచరులు సింహభాగం షాపులు దక్కించుకున్నట్టు తెలిసింది. అవి చాలవన్నట్టు ఇతరులకు కేటాయించిన షాపుల నుంచి 25 శాతం కమీషన్ ఇవ్వాలని బెదిరింపులకు దిగుతున్నట్టు సమాచారం. ఈ వ్యవహారమంతా ఓ నేత దగ్గరుండి నడిపిస్తున్నట్టు వినికిడి.

ఎక్సైజ్ అధికారులునూ..?

లాటరీ ప్రక్రియ పూర్తయి దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు సమాలోచనలు చేస్తుంటే.. కొందరు ఎక్సైజ్ అధికారులు మామూళ్ల వసూళ్లకు తెరలేపినట్టు తెలిసింది. షాపు దక్కింది కదా..? మమ్మల్ని చూడండి సార్..’ అంటూ అప్పుడే ఒత్తిడి పెంచుతున్నారు. షాపు దక్కిన వ్యాపారి ఫోన్ నంబర్ తీసుకుని మరీ సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిసింది. దుకాణాలు ఏర్పాటు చేసుకుని, వ్యాపారం ప్రారంభించిన అనంతరం నెలవారీ మామూళ్లపై సైతం ఇప్పటికే చర్చలు చేస్తున్నట్టు తెలిసింది. ఎక్సైజ్‌లో పోస్టులు దక్కించుకునేందుకు స్థాయిని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఎమ్మెల్యేలు, ఆ శాఖ ఉన్నతాధికారులకు సమర్పించి వచ్చిన సిబ్బంది.. మద్యం షాపుల్లో వసూళ్లకు తమ ఖర్చును రాబట్టుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నట్టు సమాచారం.

ప్రారంభమైన సిండికేట్

లాటరీ ప్రక్రియ ముగిసిన మరుక్షణమే సిండికేట్ **నిర్వాహకులు రంగం**లోకి దిగారు. టెండర్ల సమ**యంలో చేసుకున్న** ఒప్పందం ప్రకారం ఏరియాల **వారీగా షాపుల ఏర్పా**టుకు ముమ్మర కసరత్తు చేస్తు**న్నారు. తమ ప్రాం**తంలో తామే దుకాణాలు **పెట్టుకుంటామని, ఇ**తరులు వస్తే సహించేది లేదం**టూ తేల్చిచెబుతు**న్నారు. ఈ మేరకు లాటరీలో **షాపులు దక్కిన రో**జు సాయంత్రమే ప్రత్యేకంగా **సమావేశమైనట్టు** తెలిసింది. అనూహ్యంగా **దుకాణాలు దక్కించు**కున్న ఇతర వ్యాపారులను **తమ వైపు తిప్పుకొ**నేందుకు సిండికేట్ నాయకులు బెదిరింపులకు దిగుతున్నారు. గుడ్‌విల్ కింద కొంత మొత్తం ముట్టజెప్పి లైసెన్సుదారుల నుంచి దుకాణాన్ని స్వాధీనం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. అలా కాని పక్షంలో 25 శాతం కమీషన్ ఇచ్చేలా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు.

ఎక్సైజ్ అధికారుల అత్యుత్సాహం!

- లాటరీకే లాటరీ
- షాపు ఏర్పాటుకు మళ్లీ వేయిస్తున్న వైనం

పెరవలి: ఎక్సైజ్ అధికారులు అత్యుత్సాహం చర్చనీయాంశంగా మారింది. మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులు ఎక్కడైనా షాపులు పెట్టుకోవచ్చన్నది నిబంధన. ఇక్కడ మాత్రం ఎక్సైజ్ అధికారుల ఇష్టపకారం తంతు సాగుతోంది. షాపులు లాటరీలో దక్కించుకున్నా.. షాపు ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలన్న విషయమై షాపులు పొందిన వ్యాపారులు గ్రామాలు ఎంపిక చేసి, లాటరీ ద్వారా షాపులు పెట్టుకోవాలని ఎక్సైజ్ అధికారులు మెలిక పెట్టటంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. టెండర్ సమయంలో ఒకషాపునకు ఒక నంబర్ కేటాయించి, ఊరు పేర్లు లేకుండా లాటరీ తీశారు. అంతేకాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు మండలంలో షాపులు పెట్టుకోవచ్చని చెప్పిన అధికారులు, తీరా లాటరీలో తగిలిన షాపుల యజమానులు తమకు అనుకూలంగా ఉండే గ్రామాల వద్ద షాపులు పెట్టే స్థలాలను ఎంపిక చేసుకుని అడ్వాన్సులు చెల్లించారు. ముందు చెప్పినట్టు కాకుండా లాటరీలో షాపులు తగిలిన వారందరూ కూర్చుని, లాటరీ వేసుకోవాలని, లాటరీలో ఎవరికి ఏ గ్రామం షాపు తగిలితే వారు అక్కడ పెట్టుకోవాలని ఎక్సైజ్ అధికారులు సూచిస్తుండటంపై వ్యాపారులు లబోదిబోమంటున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయం ఎక్సైజ్ ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న వాదన వినిపిస్తోంది. ఉదాహరణకు పెరవలి మండలంలో ఐదు షాపులకు గెజిట్ నంబర్లు 83, 84, 85, 86, 87 కేటాయించారు. మండలంలో తమకు ఇష్టమైన చోట ఏర్పాటు చేసుకోవచ్చని తెలియడంతో ఒక షాపు ఎంపిక చేసుకుని, అక్కడ గది కోసం అడ్వాన్సు చెల్లించారు. ప్రస్తుతం అలా కుదరదని, తిరిగి లాటరీ వేసుకోవాలని అధికారులు చెప్పడంతో అయోమయంలో పడ్డారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, సిండికేట్ల మెప్పు కోసం ఎక్సైజ్ అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ విషయమై ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్యను వివరణ కోరగా.. నిర్దేశించిన నిబంధనల ప్రకారం షాపు మండలంలో ఎక్కడైనా పెట్టుకోవచ్చన్నారు. తిరిగి లాటరీ వేయాల్సిన అవసరం లేదన్నారు.

మహిళల రక్షణలో ముందుంటూ..

మహిళా రక్షక్ టీమ్‌కు ఎస్పీ ప్రశంసలు



మహిళా రక్షక్ టీమ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎల్లవేళలా మహిళల రక్షణలో అందుబాటులో ఉంటూ, వారికి అండగా ఉంటున్న మహిళా రక్షక్ టీం అనతి కాలంలోనే సత్ఫలితాలు అందిస్తోందని ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ, ఇన్‌స్టాగామ్ పరిచయంతో ఇంట్లో చెప్పకుండా పారిపోయి, రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరిన మైనర్ బాలికలను మహిళా రక్షక్ టీం కాపాడిందన్నారు. రెండు రోజుల క్రితం రైల్వే స్టేషన్‌లో ఆపదలో ఉన్న మహిళను ఆకతాయి నుంచి కాపాడినట్టు చెప్పారు. అదేవిధంగా ఇన్‌స్టాగామ్ పరిచయంతో ఓ మైనర్ బాలుడి వెంట రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరిన ఇద్దరు మైనర్ బాలికలను మహిళా రక్షక్ టీం గుర్తించి, ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించిందన్నారు. బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చి, వారి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించినట్టు చెప్పారు. గత అర్ధరాత్రి రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా ఉన్న మహిళను ఒక ఆకతాయి అల్లరి పెట్టగా, పెట్రోలింగ్‌లో ఉన్న మహిళా రక్షక్ టీం క్షణాల్లో అక్కడకు చేరుకుని, ఆకతాయిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. అతడిని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, హెచ్చరించినట్టు చెప్పారు. మహిళా రక్షణలో ముందంజలో ఉండి, ప్రజల మన్ననలు పొందుతున్న మహిళా రక్షక్ టీంను ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఇక ఇసుక రీచ్‌లు ఓపెన్

- నేటి నుంచి 14 రీచ్‌లలో తవ్వకాలు
- డీఎల్ఎస్‌సీలో కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఇసుక ఓపెన్ రీచ్‌లు కేటాయించిన ‘ఎల్ వన్’ అభ్యర్థులు బుధవారం నుంచి తవ్వకాలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల పర్యవేక్షణ తప్పనిసరి అని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు నిర్దేశించారు. మంగళవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ అనుసరించి ఈ నెల 16 నుంచి ‘ఎల్ వన్’ అభ్యర్థులు ఇసుక తవ్వకాలు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఇప్పటికే జిల్లాలో కేటాయించిన 14 ఓపెన్ రీచ్‌ల వివరాలు తెలియజేసినట్టు తెలిపారు. నియమ నిబంధనలను బిడ్డర్ కచ్చితంగా పాటించాలని, దీని పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. కనీసం రోజుకి వెయ్యి మెట్రిక్ టన్నులు తవ్వకాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు ఎటువంటి యంత్రాలు వినియోగించరాదన్నారు. అధికారులు, సిబ్బంది రీచ్‌లలో తవ్వకాలు, రవాణా, రికార్డుల నిర్వహణ, డెలివరీ తదితర విషయాల్లో కచ్చితత్వం పాటించాలన్నారు. ఎన్‌జీటీ మార్గదర్శకాల మేరకు ఈ బోట్స్‌మెన్ సొసైటీస్ డీసెల్‌టేషన్ ప్రక్రియను చేపట్టేందుకు అనుమతులు జారీ చేశామని తెలిపారు. ఇసుక తవ్వకాలపై విజిలెన్స్ పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా, డివిజన్ స్థాయి కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు.ప్రతి వాహనానికి జియో టాగింగ్ ఏర్పాటు చేశారన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు తనిఖీలు ముమ్మరంగా నిర్వహించి, నివేదికను డివిజనల్ అభివృద్ధి అధికారికి పంపాలని కలక్టర్ ఆదేశించారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఆర్డీఓలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి, గ్రౌండ్‌వాటర్ జిల్లా అధికారి వై.శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా రవాణాధికారి ఆర్.సురేష్ పాల్గొన్నారు.



ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

చిన్నారులకు స్వచ్ఛమైన తాగునీరు

పంచాయతీల నుంచి కుళాయి కనెక్షన్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు మంచినీటిని సరఫరా చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, విద్యుత్ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు స్వచ్ఛమైన తాగునీరు అందజేయాలన్నారు. పంచాయతీల నుంచి ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు కుళాయి కనెక్షన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కుళాయి నీటిని ఆర్వో ప్లాంట్లకు అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ కృష్ణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి బీవీ గిరి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎండీ ఆలీముల్లా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బుచ్చయ్యను మళ్లీ చిన్నబుచ్చారు!

- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆహ్వానం కరవు
- ఎవరికి చెప్పి చేస్తున్నారని మండిపడిన వైనం
- సమావేశం మధ్యలోనే వెనుదిరిగిన సీనియర్ నేత
- టీడీపీలో రానురానూ తగ్గుతున్న ప్రాధాన్యం



సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీలో సీఎం చంద్రబాబు కంటే సీనియర్ నేతైన గోరంట్ల బుచ్చయ్యచౌదరికి మరోసారి ఘోర అవమానం ఎదురైంది. రాజమహేంద్రవరం నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ప్రాధాన్యం ఇవ్వకపోవడం ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం, ఎన్నికల సన్నాహాలు, ఓటర్ల నమోదు తదితర అంశాలపై ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రులతో టీడీపీ నేతలు సమావేశమయ్యారు. సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, నేతలు పాల్గొన్నారు. కార్యక్రమానికి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు ఆహ్వానం అందింది. రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేతకు ఆహ్వానం అందలేదు. అయినా పార్టీ కార్యక్రమం కావడంతో గోరంట్ల సమావేశానికి వెళ్లారు. బుచ్చయ్యను వేదికపైకి ఆహ్వానించిన టీడీపీ నేతలు సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించాల్సిందిగా మైక్ ఇచ్చారు. వెంటనే కోపోద్రిక్తుడైన బుచ్చయ్య టీడీపీ నేతలపై స్టేజ్‌పై నుంచే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఎవరిని అడిగి సమావేశాలు పెడుతున్నారు..? సీనియర్ నేతలకు గౌరవం ఇవ్వరా..? ఈ మధ్య ఇలాంటి ఘటనలు చాలా జరుగుతున్నాయి..? పార్టీ నేతలకు మేం కనపడమా..? అంటూ మండిపడినట్టు తెలిసింది. పార్టీ సమావేశంలో తగిన ప్రాధాన్యం కూడా ఇవ్వరా..? అని అగ్గిమీద గుగ్గిలమైనట్టు వినికిడి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలా నెగ్గాలన్న విషయమై తాను సలహాలు ఇచ్చేందుకు పనికిరానా..? అంటూ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. వేదికపైన ఉన్న మంత్రులు, పార్టీ నేతలు నచ్చజెప్పాలని ప్రయత్నించినా.. ససేమిరా అన్న బుచ్చయ్య సమావేశం నుంచి మధ్యలోనే వైదొలగినట్టు తెలిసింది.

గతంలో ఇలా..

బుచ్చయ్యకు టీడీపీలో ప్రాధాన్యం తగ్గుతూ వస్తోంది. చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ అనుభవిస్తుండగా ములాఖత్‌లకు జూనియర్ నేతలకు అవకాశం కల్పించారే తప్ప బుచ్చయ్యకు ఒక్కసారి కూడా కలిసేందుకు అవకాశం ఇవ్వకుండా అవమానించారు. అప్పట్లో టీడీపీ, జనసేన నేతల ఉమ్మడి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇరు పార్టీల నుంచి 14 మంది సభ్యులతో కూడిన కమిటీ సమావేశమై సుమారు 3 గంటల పాటు బాబు అరెస్టుపై చర్చించింది. ఆ సమావేశంలో బుచ్చయ్యకు స్థానం దక్కలేదు. చివరకు కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి వలస వచ్చిన పితాని సత్యనారాయణకు స్థానం కల్పించారే తప్ప బుచ్చయ్యను పరిగణలోకి తీసుకోకుండా అవమానించారు. ఇటీవల జరిగిన నామినేటెడ్ పోస్టుల భర్తీలో సైతం బుచ్చయ్య ప్రతిపాదించిన పార్టీ నేతలకు గౌరవ ప్రదమైన పదవులు దక్కకుండా చేశారు. దీన్ని బట్టి చూస్తే టీడీపీలో బుచ్చయ్యకు ప్రాధాన్యం ఇచ్చే శకం ముగిసిందా..? అన్న ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతోంది.

మత్తు వైద్యం.. మహాద్భుతం

- నేడు ప్రపంచ అనస్థీషియా దినోత్సవం
- అన్ని శస్త్రచికిత్సలకూ ఆది ప్రక్రియ ఇదే..
- ఆర్ఎంసీ మత్తు విభాగానికి 66 ఏళ్ల చరిత్ర



శస్త్రచికిత్స వేళ రోగికి సేవలందిస్తున్న అనస్థీషియా నిపుణులు

కాకినాడ క్రైం: అమెరికన్ వైద్యుడు విలియం టిజి మోర్టన్ 1846 అక్టోబర్ 16వ తేదీన తొలిసారి ఈథర్ వినియోగించి చేసిన మత్తు వైద్య ప్రక్రియకు జ్ఞాపకార్థంగా ఈ రోజును ప్రపంచ ఆరోగ్య సంస్థ మత్తు వైద్యానికి అంకితం చేసింది. దరిమిలా, ఏటా అక్టోబర్ 16న వైద్య ప్రపంచం మత్తు వైద్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుతోంది. ఈ సందర్భంగా ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

ఎంతటి ఘనతో..

కాకినాడ జీజీహెచ్ మత్తు విభాగానికి 66 ఏళ్ల చరిత్ర ఉంది. అసంఖ్యాక విభాగాలుండే వైద్య వ్యవస్థలో ప్రతి విభాగానికి తమ పరిధిలో వైద్య సేవలందిస్తే సరిపోతుంది. మత్తు విభాగంగా పిలిచే అనస్థీసియాలజీ మాత్రం అందుకు భిన్నం. వివిధ విభాగాల్లో జరిగే ప్రతి శస్త్రచికిత్సతోను మత్తు వైద్య సేవలు ముడిపడి ఉంటాయి. మత్తు వైద్య సేవలు లేకపోతే మిగిలిన చికిత్సలు జరగవనడంలో సందేహం లేదు..

కత్తిమీద సామే..

సర్జరీ టేబుల్‌పై శస్త్రచికిత్స జరుగుతున్నంత సేపు రోగి ప్రాణాలను కాపాడే బాధ్యత, ఒత్తిడి మత్తు వైద్యులపై ఎక్కువగా ఉంటుంది. రోగిని అచేతన స్థితికి చేర్చడం, గుండె ఒత్తిడికి గురికాకుండా చేయడంలో ఎటువంటి ఆటంకం తలెత్తకుండా, కోత ఎంత లోతైనా నొప్పి తెలియకుండా చేసి, చివరికి శరీర ధర్మాన్ని అనుసరించి అంచెలంచెలుగా రోగిని చేతన స్థితికి తీసుకురావడం మత్తు వైద్యంలో కీలక ప్రక్రియ. గుండె సహా మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తుల పనితీరును ఏకకాలంలో పర్యవేక్షిస్తుండాలి. ఓ వైపు శస్త్రచికిత్స నిపుణుడు సర్జరీ చేస్తుంటే.. రక్తస్రావాన్ని గమనిస్తూ, సకాలంలో రక్తాన్ని, సెలైన్లను ఎక్కించే కీలక బాధ్యత మత్తు వైద్య నిపుణుడిదే. ఇదంతా ఓ కత్తిమీద సాము లాంటిది. ఏ మాత్రం తేడా వచ్చినా రోగి ప్రాణాలకు ముప్పే.

బహుళ అంశాల సమ్మిళితం

మత్తు వైద్య విభాగం అంటే బహుళ అంశాల సమ్మిళితం. ఐసీయూ, స్పెషల్ పెయిన్ క్లినిక్, ఫస్ట్ ఎయిడ్, సీపీఎల్ఎస్, బీసీఎల్ఎస్, దీర్ఘకాలిక నొప్పులు, క్యాన్సర్ నొప్పులు నయం చేసే ప్రక్రియ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అనస్థీషియాలజీ కిందకే వస్తాయి. వీటి నిర్వహణ అంతా మత్తు వైద్య విభాగానిదే.

అతి పెద్ద వైద్య విభాగం

జీజీహెచ్, ఆర్ఎంసీల పరిధిలో మత్తు వైద్య విభాగం అతి పెద్దది. యావత్ జీజీహెచ్ మత్తు వైద్య విభాగం 173 మందితో కూడుకుని ఉంది. వీరిలో ఒక హెచ్‌వోడీ, నలుగురు ప్రొఫెసర్లు, 15 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఒక ట్యూటర్, 54 మంది పీజీలు, నలుగురు ఎస్ఆర్‌లు, 90 మంది అనస్థీషియా టెక్నీషియన్లు ఉన్నారు. అలాగే జీజీహెచ్‌లో తాజాగా నెలకొల్పిన ప్రతిష్టాత్మక ఎన్ఈఎల్ఎస్(నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్ట్) సెంటర్ కూడా జీజీహెచ్‌లోని అనస్థీషియా విభాగం పరిధిలోనే ఉంది. ఇక్కడ వైద్య సిబ్బందికి శిక్షణనిచ్చి నైపుణ్యాలను తీర్చిదిద్దుతారు. మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ వింధ్య ఎన్ఈఎల్ఎస్‌కి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు.

సర్దుకుంటూ.. మెప్పు పొందుతూ..

హెచ్‌వోడీ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జీజీహెచ్ మత్తు విభాగం ఎంతో పురోగమించింది. ఎప్పటివో పదేళ్ల నాటి పాత పరికరాలైనా, కీలక పరికరాల కొరత ఉన్నా, ఉన్నంతలో సర్దుకుంటూనే శభాష్ అనే రీతిలో అత్యంత అరుదైన శస్త్రచికిత్సలు చేస్తూ, అనస్థీషియా వైద్యులు తమ సామర్థ్యాన్ని చాటుతున్నారు. సుమారు ఏడాదిన్నర క్రితం రూ.1.25 కోట్ల విలువైన పరికరాలను కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ జీజీహెచ్ మత్తు విభాగానికి సమకూర్చినా, రోగుల రద్దీకి అనుగుణంగా అవి చాలడం లేదు. కీలకమైన వెంటిలేటర్లు, అనస్థీషియా మెషీన్లు, డీ ఫిబ్రిలేటర్లు, సిరంజ్ పంప్‌ల కొరత, ఆయా పరికరాల మరమ్మతుల సమస్య వేధిస్తోంది.

దాతల సహకారం ఉంటే..



సేవల్లో మరింత నాణ్యత పెంచి, ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మరిన్ని వైద్య పరికరాల అవసరం ఉంది. రోగుల ప్రయోజనం కోసం వీటిని సమకూర్చేందుకు దాతలు ముందుకురావాలి. రోగులకు అత్యుత్తమ వైద్య సేవలందించడంలో రాజీ లేదు. పీజీలు సహా శక్తివంచన లేకుండా రోగుల రక్షణకు శ్రమిస్తున్నారు.

– డాక్టర్ ఏ.విష్ణువర్ధన్, హెచ్ఓడీ, అనస్థీషియా, వైస్ ప్రిన్సిపాల్, ఆర్ఎంసీ, కాకినాడ

క్లుప్తంగా

'నన్నయ'లో స్పాట్ కౌన్సెలింగ్ రేపు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంఏ, ఎంకాం, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ కోర్సులలో ప్రవేశాలకు గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. యూనివర్సిటీతో పాటు కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో ఖాళీగా ఉన్న సీట్లను దీని ద్వారా భర్తీ చేస్తామన్నారు. ఏపీపీజీసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9.30 నుంచి 11 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చని సూచించారు.

17 నుంచి ఆర్ట్స్ కళాశాలలో..

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో పీజీ కోర్సులకు ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకూ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఏపీ పీజీసెట్ 2024 ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులన్నారు. ఎంఏ తెలుగు 52, ఎంకాం 40, ఎంఏ ఎకనామిక్స్ 30, ఎంఏ పొలిటికల్ సైన్స్ 25, ఎంఏ మ్యాథ్స్‌మెటిక్స్ 34, ఎమ్మెస్సీ ఫిజిక్స్ 24, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ 2, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ 9, ఎమ్మెస్సీ ఆక్వాకల్చర్ 13 సీట్లు ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

షేర్ యాప్ పేరుతో రూ.29.30 లక్షల మోసం

కొవ్వూరు: పట్టణానికి చెందిన కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని రూ.29.30 లక్షలు మోసపోయారు. పట్టణ సీఐ పి.విశ్వం తెలిపిన వివరాల ప్రకారం.. కందాల వెంకట ద్వారకా శ్రీనివాస్ కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో మోతీలాల్ ఆశ్వాల్ ఇనిస్ట్యూషనల్ అకౌంట్ అనే షేర్ మార్కెట్ యాప్ ద్వారా నాలుగు బ్యాంకు ఖాతాలకు 29.30 లక్షలను చెల్లించారు. అనంతరం తన షేర్స్ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నం చేయగా సొమ్ము జమ కాలేదు. దీంతో రాజమహేంద్రవరంలోని మోతీలాల్ ఆశ్వాల్ ట్రేడింగ్ కంపెనీకి వెళ్లి ఆరా తీస్తే మోసపోయినట్లు తెలుసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ విశ్వం తెలిపారు.

ఏలేరు కాలువలో పడి మత్స్యకారుడి మృతి



శ్రీను మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఏలేశ్వరం: పట్టణ పరిధిలోని ఏలేరు కాలువలో పడి మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక నెయిలిపేటకు చెందిన గుదే శ్రీను(52) మంగళవారం అప్పన్నపాలెం సమీపంలోని ఏలేరు కాలువలో ట్యూబ్‌పై చేపలు పట్టడానికి వెళ్లాడు. కాలువలో నీటి ఉధృతికి ట్యూబ్ అదుపు తప్పి తిరగబడడంతో కాలువలో పడి చనిపోయాడు. మృతుడికి భార్య కృష్ణవేణి, కుమారులు అప్పలరాజు, ప్రసాద్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆహారమే ఐశ్వర్యం

బతకాలంటే అన్నం తినాలి. అది కూడా నాణ్యత కలిగినదై ఉండాలి. తీసుకున్న ఆహారం శక్తిగా మారి సత్ఫలితాలను ఇచ్చేందుకు కాస్త వ్యాయామం చేయాలి. ఇలా ఆహారం, వ్యాయామం అనేవి ఆరోగ్యంతో ముడిపడి ఉన్నాయి. పౌష్టికాహారాన్ని పొందడం మనిషి హక్కు. ఆ హక్కును కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే. గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రాష్ట్రంలో ప్రజలందరికీ పౌష్టికాహారాన్ని అందించి దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సామాన్యులకు కందిపప్పును సైతం రేషన్‌లో పంపిణీ చేయలేకపోతోంది. ఆహార ఉత్పత్తి, ఎగుమతుల్లోనూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ప్రత్యేకత ఉంది. బుధవారం వరల్డ్ ఫుడ్ డే సందర్భంగా ఆహార ఉత్పత్తులు, ప్రజల జీవన విధానంపై కథనం.



కూరగాయలు

- పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం
- ఆహార ఉత్పత్తిలో ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక స్థానం
- నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

కపిలేశ్వరపురం: వ్యవసాయం, పాడి పరిశ్రమలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడ వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 1,94,980, కాకినాడ జిల్లాలోని 1,77,030, తూర్పుగోదావరి జిల్లాలోని 1,80,920 ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. కోనసీమ జిల్లాలో 1.78 లక్షల ఎకరాల్లో కొబ్బరి ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 15 వేల హెక్టార్లలో కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నారు. ఏటా దాదాపు 2.25 లక్షల టన్నుల దిగుబడి లభిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 25,58,729 పశువులను పెంచుతున్నారు. సుమారు 200 పౌల్ట్రీలలో 1.40 కోట్ల కోళ్లను పెంచుతున్నారు. వీటి నుంచి గుడ్లు, మాంసం ఉత్పత్తి జరుగుతోంది. 60 వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తుండగా, 190 హేచరీల ద్వారా ఏడాదికి 20 వేల మిలియన్ల సీడ్ ఉత్పత్తి అవుతోంది. ఏటా 1.35 లక్షల మెట్రిక్ టన్నులను ఎగుమతి చేస్తున్నారు. .

వరల్డ్ ఫుడ్ డే

యునైటెడ్ నేషన్స్‌కు చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ అసోసియేషన్ (ఎఫ్ఏవో) అనే సంస్థను 1945 అక్టోబర్ 16న ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ రోజును ప్రపంచ ఆహార దినోత్సవంగా జరుపుకొంటున్నారు. వ్యవసాయం, ఆక్వా, పాడి పరిశ్రమ తదితర రంగాల్లో కాలానుగుణంగా వస్తున్న మార్పులు, ప్రగతిపై ఎఫ్ఏవో సంస్థ ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక సదస్సులు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

పోషక విలువలు

నిత్యం అన్నం, కూరలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యం కలగదని, వాటిలో పోషక విలువలు ఉన్నప్పుడే ఉపయోగం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. దాదాపు 45 ఏళ్ల క్రితం 1975లో గాంధీ జయంతి రోజున మాతాశిశు ఆరోగ్య పోషణకు ఉద్దేశించిన సమగ్ర శిశు సంక్షేమాభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ఏర్పాటైంది. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 5,269 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. జిల్లాల వారీగా కోనసీమలో 1,727, కాకినాడలో 1,986, తూర్పుగోదావరిలో 1,556 కేంద్రాలు ఉన్నాయి. వాటి ద్వారా 31,343 మంది గర్భిణులు, 2,46,479 మంది చిన్నారులు, 27,338 మంది బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు.

ఆహార నాణ్యత

తీసుకున్న ఆహారంలో పోషకాలు ఉన్నప్పుడే శరీరానికి బలం చేకూరుతుంది. ఆహార భద్రతా ప్రమాణాల చట్టం 2006 ప్రకారం తినే పదార్థాల్లో ఎలాంటి రసాయనాలు కలపకూడదు. కానీ నేడు ఆహార పదార్థాలన్నీ కల్తీ అవుతున్నాయి. వీటితో పాటు జంక్ ఫుడ్‌కు ప్రజలు అలవాటు పడడంతో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆహారం తయారీ, సరఫరాకు సంబంధించిన వ్యవహారాలను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) పర్యవేక్షిస్తుంది.

ఇంటి పంటతో ప్రయోజనాలు

కొంచెం సమయాన్ని, శ్రమను వెచ్చించి ఇంటి పంటను సాగు చేసుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఇంటి ఆవరణలో వివిధ రకాల కూరగాయలు మొక్కలు, పాదులను పెంచుకోవాలి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి

రేషన్ సరఫరా దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సామాన్యులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తారు. ఈ రెండు వ్యవస్థల్లోనూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో ఏజెన్సీ, సబ్‌ప్లాన్ ప్రాంతాల్లో 3,28,466 మందికి పౌష్టికాహారం పంపిణీ చేశారు. అలాగే అరగంటలోనే రేషన్ కార్డును మంజూరు చేసిన ఘనత కూడా జగన్ ప్రభుత్వానిదే. ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారులకు ఇంటికే రేషన్ సరకులు వెళ్లేవి. 2020 మే 30న రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం కాగా జిల్లాలో 1,129 రైతుభరోసా కేంద్రాలు నెలకొల్పి వాటిలో 865 కియోస్క్ యంత్రాలను సమకూర్చి ఆహార ఉత్పత్తిని ప్రోత్సహించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానికంగానే వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా సహాయకులు అందుబాటులో వచ్చారు. పాడి పరిశ్రమకు జవసత్వాలు కల్పించే లక్ష్యంతో ఆర్‌బీకే కేంద్రాలకు అనుసంధానంగా రాష్ట్రంలో 6,500 మిల్క్ కలెక్షన్, 6,500 బల్క్ మిల్క్ సెంటర్లను నెలకొల్పారు.



వరిచేనులో మెషీన్ సాయంతో ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు

కూటమి పాలనలో భారం

చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో ప్రజలకు జీవనం భారంగా మారింది. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గతంలో పోల్చితే దాదాపు 30 శాతం ధరలు పెరిగాయి. వంట నూనెలు కొనలేని పరిస్థితి నెలకొంది. రేషన్ ద్వారా ఇచ్చే సరకుల్లో మాంసకృతులు పుష్కలంగా ఉండే కందిపప్పు, రాగుల పంపిణీని నిలిచిపోయింది. కేవలం ప్రతినెలా బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

ఆహారమంటే అన్నమే కాదు




భోజనం పేరు చెబితే అన్నం, కూర మాత్రమే అనుకుంటుంటారు. వాస్తవానికి తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్లతో పాటు ఇతర అన్ని పోషక విలువలు ఉండాలి. ఖర్చు అనుకోకుండా పండ్లతో పాటు బాదం, జీడిపప్పు, పుచ్చగింజల పప్పు తదితర నానబెట్టిన గింజలను కూడా ఆహారంగా తీసుకునేందుకు ప్రయత్నించాలి. అలా చేయడం ద్వారా ఆహారపు ఖర్చు కాస్త పెరిగినా వైద్య ఖర్చులు తగ్గే అవకాశాలున్నాయని గమనించాలి.

– డాక్టర్ ఎస్.ప్రశాంతి, సబ్ డివిజనల్ ఆఫీసర్, వైద్య,ఆరోగ్య శాఖ, రామచంద్రపురం డివిజన్

దీనిపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సచివాలయాల్లో ఉద్యాన సహాయకులు సిద్ధంగా ఉంటారు. టమాటా, వంగ, బెండ, మిరప, బీర, కాకర, పొట్ల, దోస, ఆనప, గోరుచిక్కుడు, మెంతికూర, పాలకూర, చుక్కకూర, గోంగూర తదితర వాటిని డాబాలపై గానీ, పెరటిలో గానీ చాలా సులభంగా పెంచుకోవచ్చు.

సొంతూరికి వెళుతూ ఉపాధ్యాయుడి మృతి



గణేష్ కుమార్ (ఫైల్)



రైలుప్రమాదంలో మృతి చెందిన మహిళ



తునిలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన రవికిరణ్

గోపాలపురం: రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఎస్సై కర్రి సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కామవరపుకోట మండల బొర్రంపాలెం గ్రామానికి చెందిన కొనకళ్ల గణేష్ కుమార్ (33) నిడదవోలు మండలం సమిశ్రగూడెం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం సెలవు పెట్టి తన స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై కుమార్తెను కలిసి బయలుదేరాడు. గోపాలపురంలో అమరావతి వేబ్రిడ్జి వద్దకు వచ్చే సరికి జంగారెడ్డిగూడెం నుంచి వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో అతడి తలకు బలమైన గాయమైంది. గోపాలపురం సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ ప్రమాదం నుంచి అతడి కుమార్తె క్షేమంగా బయటపడింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిల్ ఢీకొని..

కాజులూరు: కాకినాడ – కోటిపల్లి రహదారిలో ఆర్యావటం వద్ద మోటారు సైకిల్ ఢీకొని గిరజాల శ్యామల (63) మృతి చెందింది. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన శ్యామల సోమవారం సాయంత్రం బంధువుల ఇంటికి పరామర్శకు వెళ్లి వస్తున్నారు. తన ఇంటి సమీపానికి వచ్చే సరికి అదే గ్రామానికి చెందిన మణికంఠ (పండు) ద్రాక్షారామ వైపు నుంచి కాకినాడ వైపునకు బైక్‌పై వేగంగా వెళుతూ ఆమె ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్యామలను స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ రాత్రి సమయంలో చనిపోయారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం గొల్లపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదంలో మహిళ

తుని: రైలు నుంచి జారిపడి మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ తుని – హంసవరం రైల్వేస్టేషన్ల మధ్య గెడ్లబీడు సమీపంలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి సుమారు 45 ఏళ్ల గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 94906 19020 నంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు

తుని: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఏఎస్సై శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం నడవపల్లికి చెందిన అయితీబత్తుల రవికిరణ్ (40) స్థానిక వీరంకి వారి వీధిలో ఓ భవనం పక్కనే వరండాలో జారిపడి పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రవికిరణ్ చోరీకి పాల్పడుతున్న క్రమంలో భవనం నుంచి జారి పడ్డాడా, అతడి మృతికి కారణమేమిటో తెలియలేదు. మృతుడి దగ్గర లభించిన ఆధార్ కార్డు ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించారు.

చరణ్ తేజ మృతిపై విచారణ జరపాలి



బాలుడి మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

- తల్లిదండ్రులు, బంధువుల డిమాండ్
- బాలుడి మృతదేహంతో ఆందోళన

కాకినాడ రూరల్: నగరంలోని నాగమల్లితోట సమీపంలోని ఎల్బీ నగర్‌లో ఐదంతస్తుల భవనం (రాజేశ్వరీ రెసిడెన్సీ) వద్ద కుక్కల చరణ్ తేజ (13) మృత దేహంతో మంగళవారం బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. చరణ్ తేజ సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో భవనంపై నుంచి పడి మృతి చెందిన విషయం తెలిసిందే. బాలుడి మృతికి గల కారణాలు తెలియకపోవడంతో సర్పవరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహానికి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో వారు మృతదేహాన్ని నేరుగా ఐదంతస్తుల భవనం వద్దకు తీసుకువచ్చి ఆందోళనకు దిగారు. తమ బిడ్డ భవనం నుంచి పడి చనిపోయినా అపార్టుమెంట్ అసోసియేషన్ కనీసం పట్టించుకోలేదని, చరణ్ తేజ మృతిపై అనుమానాలు ఉన్నాయని, న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సర్పవరం సీఐ పెద్దిరాజు, ఏఎస్సై నాగేశ్వరరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనను విరమించాలని వారికి నచ్చచెప్పారు. పీఎం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని, న్యాయం చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృత దేహానికి గైగోలుపాడు శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. చరణ్ తేజ మృతదేహాన్ని చూస్తూ తల్లిదండ్రులు సత్యాదేవి, మల్లేశ్వరరావు, తమ్ముడు అభి, బంధువులు రోదించిన తీరు కలచివేసింది. కావాలనే తమ బిడ్డను ఎవరో చంపారని వారందరూ ఆరోపించారు. చరణ్ తేజ చిన్నాన్న వీరాంజనేయులు మాట్లాడుతూ బాలుడి మృతిపై అపార్టుమెంట్ అసోసియేషన్ స్పందించ లేదని, పోలీసులు తూతూ మంత్రంగా వచ్చి కేసు నమోదు చేసి వెళ్లిపోయారన్నారు. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ దృష్టికి బాలుడు మృతి గురించి తీసుకు వెళితే కనీసం ఆయన రాలేదన్నారు.

వాడపల్లి వెంకన్నకు బ్రహ్మోత్సవాలు

- 21 నుంచి 29 వరకూ నిర్వహణ
- సిద్ధమైన ఆహ్వాన పత్రిక

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 29 వరకూ అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం స్వామివారి ఆహ్వాన పత్రికను సిద్ధం చేశారు. దాన్ని స్వామివారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పంపిణీ చేశారు. ఖండవల్లి రాజేశ్వర వర ప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో అర్చకులు, ఇతర పండితులు, గ్రామస్తుల సహకారంతో జరిగే బ్రహ్మోత్సవంలో భక్తులు పాల్గొనాలని కోరారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

27 నుంచి సత్యదీక్షలు



పవనగిరి స్వామిజీ ఆధ్వర్యంలో దీక్షా వస్త్రాలు పంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్ సత్యశ్రీనివాస్

అన్నవరం: సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా ఈ నెల 27వ తేదీన సత్యదీక్షలు చేపట్టే గిరిజన భక్తులకు మంగళవారం 600 జతల దీక్షా వస్త్రాలు పంపిణీ చేశారు. ఏటా కార్తీకమాసం ముందు వచ్చే స్వామివారి జన్మనక్షత్రం 'మఖ' నాడు దీక్ష ప్రారంభమై 27 రోజుల తరువాత వచ్చే 'మఖ' నక్షత్రం నాడు దీక్ష విరమించడం ఆనవాయితీగా వస్తోంది. దానిని అనుసరించి నవంబర్ 23న దీక్ష ముగియనుంది. కాగా, ఎక్కువ మంది భక్తులు సత్యదీక్ష చేపట్టేందుకు గాను అన్నవరం చుట్టుప్రక్కల గ్రామాలలో విస్తృత ప్రచారం చేయాలని అధికారులు నిర్ణయించారు. 27 రోజుల దీక్ష కుదరని వారికి, మహిళల కోసం 18 రోజులు, తొమ్మిది రోజుల దీక్ష కూడా చేసే వీలుంది. సత్య దీక్షలు చేపట్టనున్న మారేడుమిల్లి, అడ్డతీగల, తదితర గిరిజనప్రాంతాల్లో 600 మందికి దీక్షా వస్త్రాలు, మాలలను అందచేసినట్టు దేవస్థానం రిసెప్షన్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తెలిపారు. అడ్డతీగల మండలం పవనగిరి స్వామీజీ సమక్షంలో పంపిణీ చేశామన్నారు.

ఒక్క రూమ్ ప్లీజ్!

సత్యదేవుని సన్నిధిలో ఆశ్వయుజమాస పెళ్లిళ్లు జోరుగా జరుగుతున్నాయి. పది రోజులలో ఇప్పటికి రెండొందలకు పైగా వివాహాలు జరిగాయి. వీటికితోడు ఉచిత వివాహ మంటపాలలో ఏకకాలంలో 24 వివాహాలు జరుగుతున్న విషయం తెలిసిందే. సత్యదేవుని సన్నిధిన బుధవారం రాత్రి వంద వివాహాలకు పైగా జరిగే అవకాశం ఉంది. దీంతో ఈ వివాహాల కోసం రత్నగిరిపై సత్రం గదులలో దాదాపు 70 శాతం గదులు, వివాహ మంటపాలు అన్ని పెళ్లి బృందాలు రిజర్వ్ చేసుకున్నాయి. మిగిలిన గదుల కోసం కూడా వీఐపీల నుంచి సిఫారసులు వస్తుండడంతో ఏమి చేయాలో పాలుపోవడం లేదని అధికారులు అంటున్నారు. గదుల కేటాయింపు కోసం ముగ్గురు సూపరిండెంట్‌లతో ఈఓ కె.రామచంద్రమోహన్ కమిటీ ఏర్పాటు చేశారు.

జిల్లాల ఇన్‌చార్జి మంత్రుల నియామకం

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, కాకినాడ జిల్లాకు రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు రాష్ట్ర వ్యవసాయ, మత్స్య, పరిశ్రమల శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నియమితులయ్యారు.

నర్సరీ ప్రముఖుడు పుల్లా చంటియ్య కన్నుమూత




పుల్లా చంటియ్య (ఫైల్)

కడియం: నర్సరీ రంగ దిగ్గజం పుల్లా సత్యనారాయణ (చంటియ్య)(73) సోమవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యులు డయాలసిస్ చేస్తున్నారు. ఎప్పటిలాగే సోమవారం రాత్రి డయాలసిస్ పూర్తయ్యాక కార్డియాక్ అరెస్టు సంభవించడంతో చంటియ్య తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చంటియ్య భౌతిక కాయాన్ని కడియపులంకలోని వారి స్వగృహానికి తరలించారు. పెద్ద ఎత్తున నర్సరీ రైతులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు చంటియ్య మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నర్సరీ రైతుల సమక్షంలో చంటియ్య అంత్యక్రియలు కడియపులంకలోని కైలాసభూమిలో నిర్వహించారు. ఆయనకు భార్య మహాలక్ష్మి, కుమారుడు పుల్లా పెద సత్యనారాయణ, కుమార్తెలు పిండి కనకదుర్గ, సంగిశెట్టి వరలక్ష్మి ఉన్నారు. పిల్లలకు వివాహాలయ్యాయి. కుమారుడు చంటియ్యతో పాటే నర్సరీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు.

పక్కింటి వాడే దోచేశాడు..

- దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ వీరయ్య గౌడ్



కేసు వివరాలను విలేకరులకు తెలియజేస్తున్న సీఐ వీరయ్య గౌడ్

రాజానగరం: కానవరంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో పక్కింటి వాడే నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతడు దొంగిలించిన సొత్తులో తొమ్మిది కాసుల బంగారం, రూ.1.50 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్వీ వీరయ్య గౌడ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. కానవరానికి సంగిశెట్టి సీతారామాంజనేయులు ఈ నెల 3వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో గ్రామంలో జరుగుతున్న భవానీల పూజకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి రాత్రి 12.30 గంటలకు ఇంటికి వచ్చారు. లోపలకు వెళ్లే చూసేసరికి బీరువాలోని 14 కాసుల బంగారు నగలు, రూ.10 వేలు మాయమయ్యాయి. దీంతో రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి, బాధితుడి ఇంటికి సమీపంలో నివాసముంటున్న సంగిశెట్టి శివనారాయణపై అనుమానంతో విచారణ నిర్వహించారు. చివరకు అతడు నేరాన్ని అంగీకరించాడు. దొంగిలించిన బంగారంలో ఐదు కాసులను రాజమహేంద్రవరంలోని అట్టికా గోల్డ్ ఫైనాన్స్‌లో అమ్మేశాడు. ఆ సొమ్ములతో ఎంజాయ్ చేస్తూ మంగళవారం పోలీసులకు చిక్కాడు. అతడి నుంచి మిగిలిన తొమ్మిది కాసుల బంగారాన్ని, అమ్మిన బంగారానికి సంబంధించిన సొమ్ముల నుంచి అతడి వద్ద మిగిలిన రూ.1.50 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు.